# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 25.12.2024 | 24 క్యారెట్లు 79,106.00 | కిలో వెండి 98,456.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:63

www.vishalabharati.com







## కేసీఆర్, హరీశ్ రావుకు

# బిగ్ రిలీఫ్

- కాళేశ్వరం కేసులో హైకోర్టు ట్విస్ట్
- జిల్లా సెషన్స్ కోర్టు ఆదేశాలు రద్దు
- పిటిషన్ దారుడికి నోటీసులు జారీ
- తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుకు అనుకూలంగా హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. భూపాలపల్లి జిల్లా సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. దాంతో పాటు ఫిర్యాదుదారుడు లింగమూర్తికి కూడా నోటీసులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగుబాటుకు అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు కారణమంటూ లింగమూర్తి

..మిగతా 2 లో

# పైరవీలకు నో ఎంట్రీ

- ఇందిరమ్మ ఇళ్లపై తప్పు జరగొద్దు
- సీఎం జోక్యం కూడా ఉండదు
- తేడా వస్తే అధికారులపై చర్యలు
- అక్రమాలకు కలెక్టర్లే బాధ్యులు
- సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో చిన్నతప్పు జరిగినా ఉపేక్షించే ప్రసక్తేలేదని.. లబ్ధిదారులను పూర్తి పారదర్శకంగా గుర్తించాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టంచేశారు. కడుపేదలను గుర్తించి లబ్ధిదారులను ఎంపికచేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో 33 జిల్లాలకు కొత్తగా నియమించిన ప్రాజెక్టు డైరెక్టర్ల (పీడీల)తో 'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక, యాప్‌సర్వే, గత ప్రభుత్వ రెండు పడకగదుల ఇళ్లపై మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో గృహనిర్మాణశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పైరవీలకు తావులేదు. సీఎం జోక్యం కూడా ఉండదు. లబ్ధిదారుల ఎంపికలో తేడావస్తే చర్యలు తప్పవు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే నా దృష్టికి వస్తుంది. ప్రజల ఫిర్యాదుల కోసం త్వరలో వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటుచేస్తున్నాం. అక్రమాలు జరిగితే కలెక్టర్లను బాధ్యులను చేస్తాం. ఇందిరమ్మ ఇళ్లు తప్పనిసరిగా త్రివర్ణంలో ఉండేలా చూడాలి. గత ప్రభుత్వం గృహనిర్మాణశాఖను నిర్లక్ష్యం చేసింది. ఈ శాఖకు మళ్లీ ఓ గూడును ఏర్పాటుచేశాం. పేదలకు సొంతింటి కలను నేరవేర్చడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రాబోయే

..మిగతా 2 లో

### తప్పుడు సమాచారాన్ని గుర్తించాలి..

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేయడానికి ప్రజాపాలన దరఖాస్తుదారుల వద్దకు వెళ్లినప్పుడు సర్వేయర్లు ప్రతి విషయాన్ని పరిశీలించాలి. దరఖాస్తుదారులు చెబుతున్న విషయాలు వాస్తవమేనా.. అన్న విచారణ చేయాలి. తప్పుడు సమాచారాన్ని యాప్‌లో నమోదుచేస్తే సర్వేయర్లను బాధ్యులనుచేస్తాం" అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గృహనిర్మాణశాఖలో పలువురు డీఈ, ఈఈ, ఎస్ఈలకు పదోన్నతుల పత్రాలను అందించారు. పదోన్నతులు పొందిన పలువురు అధికారులను జిల్లాలకు పీడీలుగా నియమించారు. పీడీలు జిల్లా కలెక్టర్లకు రిపోర్టు చేయాలని మంత్రి సూచించారు. రెండు, మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



## త్వరలో పెండింగ్ బిల్లుల విడుదల

- సర్పంచులు, ఎంపీటీసీలకు గుడ్‌న్యూస్
- మొదటగా రూ.10 లక్షల లోపు బకాయిల చెల్లింపు
- బీఆర్ఎస్ నేతలు తక్కువ మాట్లాడితే మంచిది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2 లో

## మోడీ వచ్చాక భారత భూభాగాన్ని కోల్పోయాం

- చైనా దురాక్రమణ, మణిపూర్ అంతర్యుద్ధంపై చర్చ జరగాలి
- అదానీతో ఒప్పందాల రద్దు.. రాష్ట్ర పరిధిలో ఉండదు
- పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

చైనా దురాక్రమణ, మణిపూర్‌లో అంతర్యుద్ధంపై లోతుగా చర్చ జరగాలని, వాటిని నియంత్రించినప్పుడే భారతదేశంలో శాంతిసామరస్యాలు నెలకొంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ సలహా కమిటీ ఛైర్మన్ కొంపల్లి యాదవరెడ్డి రచించిన

..మిగతా 2 లో





## బీసీలకు 42% రిజర్వేషన్లు

- కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయాలి
- ఎగవేయాలని చూస్తే ఊరుకునేది లేదు
- రిజర్వేషన్లు పెంచే వరకు పోరాటం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

2 లో




## సంక్రాంతి తర్వాతే పంచాయతీ పోరు

- ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రిజర్వేషన్ల మార్పుపై కసరత్తు
- ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే పోటీకి అనర్హత
- ఓటరు జాబితాను సిద్ధం చేసిన ఈసీ
- ముందు గ్రామాల్లో, తర్వాత మున్సిపాలిటీల్లో

2 లో

# అల్లు అర్జున్ ఉక్కిరి బిక్కిరి

## తొక్కిసలాట వీడియోలు ముందుపెట్టి ప్రశ్నలు


- 50కి పైగా అంశాలపై వివరణ కోరిన పోలీసులు
- నాలుగు గంటల పాటు విచారణ
- రేవతి మరణించినట్టు థియేటర్‌లో నాకెవరూ చెప్పలేదు..
- పోలీసుల అనుమతి నిరాకరణపై సమాచారం లేదు
- ఎప్పుడు పిలిచినా విచారణకు సహకరిస్తా
- సంధ్య థియేటర్ ఘటనపై సినీ నటుడు అల్లు అర్జున్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో చిక్కడపల్లి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో ఏ11గా ఉన్న సినీ నటుడు అల్లు అర్జున్‌ను మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిచి మూడు గంటలకు పైగా విచారించారు. వివిధ అంశాలపై ఆయనను ప్రశ్నించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోలో చిత్రీకరించారు. సీసీఎస్ డీసీపీ శ్వేత, మధ్య మండలం డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు డీసీపీ ఆనంద్‌ల నేతృత్వంలోని ప్రత్యేక బృందం

..మిగతా 2 లో





## ఐదుగురు జవాన్లు దుర్మరణం

- కశ్మీర్‌లో లోయలో పడిన ఆర్మీ వెహికల్
- పలువురికి తీవ్ర గాయాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జమ్మూకశ్మీర్‌లో వాహనం లోయలోపడి ఐదుగురు సైనికులు మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. పూంఛ్ జిల్లా ఎల్ఓసీ సమీపంలోని ఘరోయా ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. జవాన్ల వాహనం 300 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
25.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# పైరవీలకు నో ఎంట్రీ

మొదటిపేజీ తరువాయి

నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించాం. అవినీతి, అక్రమాలకు తావులేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలి. పీడీలకు పూర్తిస్వేచ్ఛను ఇస్తున్నాం. అన్ని మండలాల్లో నమూనా ఇళ్ల నిర్మాణం జనవరి చివరినాటికి పూర్తికావాలని తెలిపారు.

**శాస్త్రీయ పద్ధతిలో పేదల గుర్తింపు..**

సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పొంగులేటి వెల్లడించారు. హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ''ప్రస్తుతం ఎన్నికలు లేవు. ఎన్నికల ఆటలో భాగంగా మేము ఇళ్లు ఇవ్వడం లేదు. చిత్తశుద్ధితోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలుచేస్తున్నాం. ఆదరాబాదరాగా ఇళ్లను పంపిణీచేస్తే తప్పులు జరుగుతాయన్న ఉద్దేశంతోనే లబ్ధిదారుల ఎంపిక ఆలస్యమైంది. శాస్త్రీయ పద్ధతిలో పేదలను గుర్తించాలన్న లక్ష్యంతోనే ఇన్నాళ్లు ఆగాం. ఇళ్ల నిర్మాణానికి పూర్తిస్థాయిలో యంత్రాంగాన్ని నియమించాం. ఇంతవరకు రాష్ట్రంలో 34 లక్షల మంది దరఖాస్తుదారుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదుచేశాం. వచ్చేనెల మొదటివారంలో మొత్తం దరఖాస్తుదారుల సర్వే పూర్తవుతుంది. ఇళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ.. మళ్లీ అధికారంలోకి వస్తాం.. ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను ఉపయోగించుకుంటాం. గ్రామసభల ద్వారా నిరుపేదలను గుర్తిస్తాం. కలెక్టర్ల ద్వారా మంజూరయినా జాబితాలకు ఇన్‌ఛార్జి మంత్రులు ఆమోదం తెలుపుతారు. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని ఏర్పాటుచేస్తాం. గతంలో ఉన్న వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి వీరిని నియమిస్తాం. రెండు పడకగదుల ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించి అర్హులకు అందిస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు రేషన్‌కార్డు అవసరం లేదు. మధ్య తరగతి ప్రజలకు ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ విధానంలో ఇళ్లను అందిస్తాం. గతంలో లీజుకిచ్చిన హౌసింగ్ స్థలాలకు డబ్బులు చెల్లించకపోతే రద్దుచేస్తాం. ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులు చెల్లించకపోతే వేలంపాట నిర్వహిస్తాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అక్రమాలను గుర్తించడానికి విజిలెన్స్ బృందాలను ఏర్పాటుచేస్తాం'' అని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు.




# సంక్రాంతి తర్వాతే పంచాయతీ పోరు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సంక్రాంతి పండుగ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎలక్షన్స్‌కు ముందు జరగాల్సిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలకు సవరణలను పూర్తి చేసింది. ప్రధానంగా రిజర్వేషన్లను ఐదేండ్లకోసారి మార్చే సవరణకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. వీటితోపాటు పంచాయతీరాజ్ చట్ట సవరణలో అనేక మార్పులు చేశారు. ఒక మండలంలో కనీసం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండే విధంగా మార్పు చేశారు. 80 గ్రామాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేశారు. కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏర్పాటు చేయగా, రెండింటిని కార్పొరేషన్లుగా అప్ గ్రేడ్ చేశారు. ఇలా ఎన్నికలకు చట్ట పరంగా చేయవలసిన ఏర్పాట్లన్నింటినీ ప్రభుత్వం పూర్తి చేసింది. మరోవైపు ఎన్నికల కమిషన్ సైతం ఓటరు జాబితాను, పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసింది.

**రిజర్వేషన్ల మార్పుపై కసరత్తు..**

స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ ను సుప్రీంకోర్టు సూచించిన విధంగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా ఖరారు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పటికే జిల్లా పర్యటనలు, బహిరంగ వినతులు స్వీకరించి నివేదికను ప్రాథమికంగా సిద్ధం చేసింది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కంప్యూటరైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అది పూర్తి కాగానే కమిషన్ కు డేటా అందిస్తారు. దాని ఆధారంగా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. ఆ తర్వాత కేబినెట్ నివేదికపై చర్చించి ఆమోదించి రిజర్వేషన్లను ఖరారు చేస్తుంది. అనంతరం గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను ఖరారు చేసి ఎన్నికల కమిషన్‌కు అందించనుంది. అనంతరం ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. సర్పంచులు ఎంపీపీ, జడ్పీ చైర్మన్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. వీటిలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ముందుగా ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అందుకనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఎంపీటీసీ సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్న మండలాల్లో ఐదింటిని ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీలో చేసిన చట్ట సవరణకు గవర్నర్ ఆమోద ముద్ర వేయగానే ఆ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. మొదట గ్రామీణ స్థానిక సంస్థలు, ఆ తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహిస్తారు.



# ఓయూలో ఫిట్ ఇండియా సైక్లింగ్ రైడ్

- సైకిళ్ల వినియోగంపై అవగాహన
- వాయుకాలుష్యం, ట్రాఫిక్ రద్దీపై సూచనలు

విశాలభారతి, హైదరాబాద్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్, డాక్టర్ మాక్స్‌వెల్ ట్రెవర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి ఆదివారం నాడు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎస్ఏటీజీ సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో ఫిట్ ఇండియా సైక్లింగ్ రైడ్‌ను నిర్వహించింది. ఈ రైడ్‌ను శ్రీమతి నిషా విద్యార్థి సమన్వయం చేశారు. డైరెక్టర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్, డా. మాక్స్‌వెల్ ట్రెవర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, ఫిట్ ఇండియా ఉద్యమం అనేది సైకిళ్ల వినియోగం యొక్క అవగాహన మరియు ప్రాముఖ్యతను తీసుకురావడానికి భారత ప్రభుత్వం యొక్క ప్రాజెక్ట్, ఇది ఒకరిని ఫిట్‌గా చేయడమే కాకుండా వాయు కాలుష్యం మరియు ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో కూడా దోహదపడుతుంది, మనమందరం ఇంధన వాడకాన్ని తగ్గించి శారీరక శ్రమను వినియోగించాలన్నదే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.

# కేసీఆర్, హరీశ్ రావుకు బిగ్ రిలీఫ్

మొదటిపేజీ తరువాయి

భూపాలపల్లి జిల్లా కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ స్వీకరించిన జిల్లా సెషన్స్ కోర్టు కేసీఆర్, హరీష్ రావులకు నోటీసులు పంపింది. దీంతో వారు తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టులో దాఖలైన ప్రైవేటు కేసును కొట్టేయాలని కోరారు. ఈ మేరకు నేడు విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి.. ఆ నోటీసులను సస్పెండ్ చేసింది. కేసులో తదుపరి విచారణను ధర్మాసనం జనవరి 7కు వాయిదా వేసింది.ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ కుంగుబాటుపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అధికారులు జోషి, రజత్ కుమార్‌ను విచారించిన ఘోష్ కమిషన్.. ఇటీవల ఐఏఎస్ స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ సోమేష్ కుమార్‌ను సైతం విచారించింది.

# త్వరలో పెండింగ్ బిల్లుల విడుదల

- సర్పంచులు, ఎంపీటీసీలకు గుడ్ న్యూస్
- మొదటగా రూ.10 లక్షల లోపు బకాయిల చెల్లింపు
- బీఆర్ఎస్ నేతలు తక్కువ మాట్లాడితే మంచిది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పెండింగ్ బిల్లుల విడుదలకు ఆలోచన చేస్తున్నామని, ఈ విషయంపై భారాస నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. పెండింగ్ బిల్లులకు సంబంధించిన అంశాలపై డిప్యూటీ సీఎం ప్రకటన విడుదల చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు సుమారు రూ.1,300 కోట్ల వరకు ఉన్నాయన్నారు. అందులో రూ. 10 లక్షల లోపు ఉన్న బకాయిల విలువ సుమారు రూ.400 కోట్లు ఉన్నట్లు చెప్పారు. మొదటగా రూ.10 లక్షల లోపు ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు భట్టి పేర్కొన్నారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తానూ గమనించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ పెద్దలు స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులతో పనులు చేయించి బిల్లులు పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. ఇందుకు కారణమైన భారాస నేతలే.. పెండింగ్ బిల్లుల కోసం రోడ్లపైకి వస్తాం, ధర్నాలు చేస్తామని ప్రకటనలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.





# మహిళలకు మర్యాద ఇవ్వడం విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలి

- శ్రీ చైతన్య హై స్కూల్‌లో విద్యార్థులకు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం

విశాలభారతి, రామగుండం

స్థానిక ఎన్టీపీసీ టౌన్‌షిప్ లోని, శ్రీ చైతన్య హై స్కూల్ యాజమాన్యం "బేటి సమాన్‌రెస్పెక్ట్ గర్ల్స్" అనే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం ఎన్టీపీసీ ఈఎస్ఐ డిస్పెన్సరీ డాక్టర్ వి.రజిత, సీనియర్ అసిస్టెంట్ ఎం.మమత హాజరయ్యారు. ముఖ్య అతిథి డా.వి.రజిత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజంలో ఆడవారి పట్ల మర్యాదపూర్వకంగా ఎలా ఉండాలో అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థినిలకు గుడ్ టచ్ & బ్యాడ్ టచ్ గురించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు పాఠశాల నుండి ఎఫ్సీఐ క్రాస్ రోడ్డు చౌరస్తా వరకి రెస్పెక్ట్ గర్ల్స్ నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ శ్రీ చైతన్య యాజమాన్యం ప్రతి నెల సమాజానికి ఉపయోగపడే ఇటువంటి స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నమ్రత, క్యాంపస్ ఇంచార్జ్ నరేంద్ర కుమార్, డీన్ అనిల్ కుమార్, ప్రైమరీ ఇన్చార్జి శైలజ, పి.ఈ.టి శృతి విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ ఉక్కిరి బిక్కిరి

మొదటిపేజీ తరువాయి

ఈ విచారణను పర్యవేక్షించింది. అల్లు అర్జున్ స్టేషన్‌కు వచ్చినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరేవరకు పోలీసులు పటిష్ఠమైన భద్రత కల్పించారు. తొక్కిసలాటకు ముందు, తర్వాత చోటుచేసుకున్న సంఘటనలు, అనంతర పరిణామాలపై పోలీసులు అర్జున్‌కు 50కి పైగా ప్రశ్నలు సంధించారు. అవసరమైతే మరోసారి స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని వారు చెప్పగా, విచారణకు పూర్తిగా సహకరిస్తానని అల్లు అర్జున్ తెలిపారు. విచారణ సమయంలో అల్లు అర్జున్ పోలీసుల ప్రశ్నలకు ఉక్కిరి బిక్కిరి అయినట్లు తెలుస్తోంది. సంధ్య థియేటర్‌లో పుష్ప2 బెనిఫిట్ షో సందర్భంగా.. సినీ నటుల ర్యాలీకి అనుమతి ఇవ్వలేదనే విషయం మీకు తెలియదా అని ప్రశ్నించగా.. థియేటర్ యాజమాన్యం ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదని అర్జున్ బదులిచ్చినట్లు సమాచారం. 4050 మంది బౌన్సర్లతో వచ్చి ప్రేక్షకులను నెట్టుకుంటూ లోపలకు ప్రవేశించటమే తొక్కిసలాటకు కారణమైందంటూ పోలీసులు సంబంధిత వీడియోలను ఆయనకు చూపారు. బౌన్సర్ల గురించి సమాచారం ఇవ్వాలని సూచించారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందటం, బాలుడు గాయపడినట్టు పోలీసు అధికారులు అల్లు అర్జున్‌కు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లమని సూచించినా తిరస్కరించటంపై.. నాలుగు ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. రేవతి మరణించిన విషయం తనకు ఎవరూ చెప్పలేదంటూ అర్జున్ ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైనట్టు సమాచారం. తాము ప్రీమియర్ షోకు హాజరయ్యేందుకు పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారణ సమయంలో అర్జున్.. మధ్యాహ్నం ఒకసారి బయటి నుంచి టీ తెప్పిస్తే తాగారు. 1015 నిమిషాల విరామం తరువాత మరోసారి పోలీసుల ఎదుటకు వచ్చారు. అర్జున్‌ను ఒంటరిగానే విచారించారు. డీసీపీ అక్షాంశ్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాజు నాయక్ విచారణలో పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శ రిజర్వేషన్ కల్పించకుండా ఎగవేయాలని చూస్తే ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ హామీలను అమలుచేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. బీసీల సమస్యలను కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోకపోవడం దారుణమని, కుల వృత్తుల వారికి కనీస మద్దతు ఇవ్వడం లేదని అన్నారు. కేసీఆర్ హయాంలో బీసీల కోసం అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

# మోడీ వచ్చాక భారత భూభాగాన్ని కోల్పోయాం

మొదటిపేజీ తరువాయి

'నట్స్, బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్' ఆంగ్ల పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఐప్సో ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం ప్రసంగిస్తూ.. 'ప్రపంచంలో ఎక్కడ శాంతి సభలు, సమావేశాలు జరిగినా యాదవరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ రోజు ప్రపంచ శాంతి అనే పదమే వినిపించడం లేదు. 2014 తరువాత దాదాపు రెండు వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించింది. దీనిపై చర్చించడానికి, వాస్తవాలను బయటపెట్టడానికి పాలకులకు దమ్ములేదు. మణిపూర్‌లో రెండు జాతుల మధ్య ఘర్షణ జరుగుతోంది. అక్కడ సరఫరా అవుతున్న అధునాతమైన ఏకే 57 రైఫిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? ఖనిజ సంపదను దోచుకోవడానికి ఏ కార్పొరేట్ కంపెనీలు ఈ అంతర్యుద్ధాన్ని, ఊచకోతలను ప్రోత్సహిస్తున్నాయి? భారత సైన్యం మణిపూర్‌లో శాంతిని నెలకొల్పలేదా? తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై యాదవరెడ్డితో సోనియాగాంధీ సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించిన విషయం ఎంత మందికి తెలుసు? మనకు నచ్చినా నచ్చకపోయినా.. ఉండవల్లి అరుణ్‌కుమార్ తనదైన కోణంలో పుస్తకాన్ని తీసుకొచ్చారు.

తెలంగాణ ఉద్యమకారుల పక్షాన సమగ్రమైన పుస్తకం తీసుకొచ్చే బాధ్యతను యాదవరెడ్డి తీసుకోవాలి. యుద్ధానికి అవసరమైన డ్రోన్లు హైదరాబాద్ కేంద్రంగా అదానీ కంపెనీ తయారు చేస్తూ వివిధ దేశాలకు సరఫరా చేస్తోందని, ఆ కంపెనీ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని వక్తలు చెబుతున్నారు. అది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం. కొన్ని విషయాల్లో కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయడానికి ఉండదు. మోదీ ప్రధాని అయిన తరువాత రాజ్యాంగాన్ని సవరించి.. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు, రక్షణ రంగంలో విధానాలనే మార్చుకున్నారు' అని సీఎం ఆరోపించారు. ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు వల్లభ్ సేన్ గుప్తా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉద్యమాన్ని బలోపేతం చేయడం ద్వారా యుద్ధవాతావరణాన్ని నివరించే అవకాశం ఉందన్నారు. రచయిత యాదవరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రపంచ దేశాలు రక్షణశాఖలకు 2.4 ట్రిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయిస్తున్నాయి. అందులో కనీసం 10 శాతమైనా తగ్గిస్తే, ప్రపంచ దేశాల్లోని మొత్తం జనాభాకు విద్య, వైద్యసదుపాయాలు సమకూర్చవచ్చన్నారు. భారతదేశానికి 64 వేల కోట్ల డాలర్ల అప్పులున్నా.. రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రపంచ దేశాల్లో మూడో స్థానంలో ఉంది' అని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే యాదయ్య, భారాస మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఐప్సో జాతీయ ప్రిసీడియం కమిటీ సభ్యులు డా.సుధాకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీఎల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాదవరెడ్డి, చంద్రారెడ్డి దంపతులను ముఖ్యమంత్రి సత్కరించారు.



# ఐదుగురు జవాన్లు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి

వాహనంలో డ్రైవర్‌తో సహా 10 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. అయితే ఈ ఘటనలో ఉగ్రకోణం లేదని సైన్యం తెలిపింది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నామని డిఫెన్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు. బహుశా రోడ్డు మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని అన్నారు. బనోయికి ఆరు వాహనాలతో కూడిన కాన్వాయ్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఇదిలా ఉండగా, లోయ నుంచి జవాన్ల మృతదేహాలను వెలికి తీసినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. గాయపడిన సైనికులను పూంఛ్‌లోని ఫీల్డ్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. లెఫ్టినెంట్ జనరల్ ఎంవీ సుచింద్ర కుమార్, ధృవ కమాండ్ అన్ని ర్యాంకుల అధికారులు ఐదుగురు వీర జవాన్ల మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపాయని నార్తర్న్ కమాండ్ పేర్కొంది. ఇక, మృతుల కుటుంబాలకు తాము అండగా నిలుస్తామని ధృవ కమాండ్ తెలిపింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
25.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ఉప్పల్, విశాలభారతి:

ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 160 (కోటి 60 లక్షల) కల్యాణ లక్ష్మి మరియు షాది ముభారక్ చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వాణీ రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ,శాంతి సాయి జెన్ శేఖర్ , ప్రభుదాస్ ,రజిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## అంతర్ విభాగ శోధనకు ప్రాధాన్యం

- జార్జ్ వాషింగ్టన్ వర్సిటీ ప్రొఫెసర్ కౌసిక్ సర్కార్



పటాన్ చెరు,విశాలభారతి

అంతర్ విభాగ పరిశోధన(ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్)కు ప్రాధాన్యం పెరుగుతోందని, అత్యాధునిక పరిశోధనలు అందుకు ఊతం ఇస్తున్నాయని అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ విశ్వవిద్యాలయ మెకానికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కౌసిక్ సర్కార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'రెండు అంశాల కథ: ఇమేజింగ్, థెరప్యూటిక్స్, టిష్యూ ఇంజనీరింగ్ కోసం బబుల్స్ (బుడగలు), విస్కోలాస్టిక్ మీడియంలో వినియోగం' అనే అంశంపై మంగళవారం ఆయన నైపుణ్యోపన్యాసం చేశారు. ఈ రంగంలో తాను చేస్తున్న బహుళ విభాగ పరిశోధనలను వివరిస్తూ, ఆరోగ్య పరిరక్షణ, అంతరిక్షం (ఏరోస్పేస్)లో ఇంజనీరింగ్ అప్లికేషన్లు, వాటి భవిష్యత్తు గురించి ఆసక్తిని పెంపొందించారు. అల్ట్రాసౌండ్‌సహాయక ఎముక, మృదులాస్థి కణజాల ఇంజనీరింగ్ లో మైక్రోబబుల్, వాటి వినియోగాలను ప్రొఫెసర్ కౌసిక్ వివరించారు. ముఖ్యంగా త్రీడీప్రింటెడ్ పరంజాల సందర్భంలో, చికిత్సా విధానాలను విప్లవాత్మకంగా మార్చడానికి, రోగి ఫలితాలను మెరుగుపరచడానికి ఈ సాంకేతికతల సామర్థ్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నిర్దిష్ట క్లినికల్ ప్రయోజనాల కోసం బుడగలను రూపొందించడానికి ఇంజనీరింగ్ ను ఎలా ఉపయోగించవచ్చనే దానిపై డాక్టర్ సర్కార్ పలు అంతర్దృష్టులను, అంతర్ విభాగ స్వభావాన్ని నొక్కి చెప్పారు. తొలుత, గీతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ.అక్తర్ ఖాన్ అతిథిని స్వాగతించారు. ఏరోస్పేస్, మెకానికల్ ఇంజనీరింగ్ లోని అభివృద్ధి చెందుతున్న రంగాలలో ప్రొఫెసర్ కౌసిక్ పరిశోధన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఏరోస్పేస్ ప్రొపల్షన్ సిస్టమ్స్ లో బబుల్ ఇమేజింగ్ ఒక ముఖ్య పాత్ర పోషిస్తోందని డాక్టర్ ఖాన్ పేర్కొన్నారు. ఈ నైపుణ్యోపన్యాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.





## ప్రజలు, పరిశ్రమల భద్రత, రోడ్డు ప్రమాదలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సైబర్ నేరాల నివారణకు ప్రజలలో అవగాన కార్యక్రమాలు నిర్వహించాలి
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్
- బిడియల్ భానూర్ పోలీసు స్టేషన్ తనిఖీ
- అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డుల పరిశీలన

పటాన్ చెరు,విశాలభారతి

ప్రజలు, పరిశ్రమల భద్రతతో పాటు రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సంగారెడ్డి జిల్లా, బిడియల్ భానూర్ పోలీసు స్టేషన్ ను మంగళవారం సందర్శించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సిబ్బంది టర్న్ అవుట్, పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది బ్యారెక్ పరిశుభ్రత, చెక్ చేయడం జరిగింది. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను, స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులను చెక్ చేస్తూ..ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని, యు.ఐ కేసులు పరిమిత లిమిట్ ఉండేలా చూడాలన్నారు. బిడియల్ హైదరాబాద్ పరీవాహక ప్రాంతం కావడం వలన భూసంభందిత తగాదాలు అధికంగా ఉంటాయని, సివిల్ కేసులల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. పరిశ్రమలు ఉండటం వలన ఇతర రాష్ట్రాల నుండి వచ్చే మైగ్రేట్ లేబర్ ఎక్కువగా ఉంటారని, ఎక్కువ దొంగ తనాలు జరగడానికి అవకాశం ఉంటుందని, డే/రాత్రి బీట్ డ్యూటి, పెట్రోలింగ్ అధికారులు రౌడీ, కేడి, సస్పెక్ట్ లను చెక్ చేస్తూ.. అనుమానస్పదంగా ఉన్న ప్రతి వ్యక్తులను చెక్ చేయాలన్నారు. తరుచూ వాహనాల తనిఖీ, నాకాబంది వంటి స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి అనుమానిత వ్యక్తులను/వాహనాలను అదుపులోకి తీసుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ, కేడి, సస్పెక్ట్ లను తరుచూ చెక్ చేస్తూ, ఆన్లైన్ రికార్డులలో అప్డేట్ చేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు అండగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఆల్ప్రాజోలం తయారి, నిషేదిత గంజాయి, గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ అమ్మకాలు, అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, పి.డి.యస్ రైస్ అక్రమ రవాణాకు తావు లేకుండా చూడాలన్నారు. సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, అన్ని అపార్ట్మెంట్లలో, పలు ప్రధాన కూడళ్లలో హై రెజల్యూషన్ కలిగిన సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో అధిక సైబర్ నేరాలు బొల్లారం, అమీన్ పూర్ మరియు పటాన్ చెర్వు స్టేషన్ల పరిధిలో జరుగుతున్నాయని, కమ్యూనిటీ పోలిసింగ్, సోషల్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ..విధి నిర్వహణలో నిబద్ధతతో ఉండాలని తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వహించినప్పుడే అధికారుల మన్ననలు పొందుతారని, చేసిన పనికి గుర్తింపు లభిస్తుందన్నారు. విధి నిర్వహణలో క్రమ శిక్షణతో ఉండాలని, స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. పోలీసు శాఖలో ఫిజికల్ ఫిట్నెస్ చాలా కీలకం అని, రోజు వ్యాయామం చేస్తూ ఫిట్ గా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిడియల్ యస్.హెచ్.ఓ స్వామి గౌడ్, ఎస్ఐ భారత్ బుషన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పోచారంలో ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి జాతర

పటాన్ చెరు,విశాలభారతి

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, ఆధ్యాత్మికతకు నిలయాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం పోచారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర మహోత్సవానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్, పిఎసిఎస్ చైర్మన్ బిక్షపతి, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, సీనియర్ నాయకుడు దశరథ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గ్రామ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిరుపేద మహిళకు కుట్టు మిషన్ పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి

నిరుపేదలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఎండి గౌసియా బేగం భర్తను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. తనకు అండగా నిలవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కోరగా.. కుట్టు మిషన్ కొనుగోలు చేసి అందించారు. ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రమోద్ గౌడ్, సత్తయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని

- అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగా రెడ్డి
- చర్చీలకు క్రిస్మస్ కేకుల పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి

క్రిస్మస్ పండుగను క్రైస్తవులందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి కోరారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని చర్చిలకు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి మంగళవారం సాయంత్రం నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేకులను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అందజేసిన కేకులను కూడా ఆయన పంపిణీ చేశారు. క్రైస్తవులందరూ ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ పర్వదినాన్ని నిర్వహించుకోవాలని కోరారు. అందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రకళ గోపాల్, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, మహిపల్ రెడ్డి, నాయకులు కొల్లూరి యాదగిరి, చర్చిల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్య వైశ్య మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- TPCC ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త.

ఎల్బ్ నగర్ విశాలభారతి:

మెనేపల్లీ ప్రెజెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన వైశ్య లైమ్ టైం అవార్డ్స్ ఫర్ ఉమెన్ 2024 కి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు పురుషుల కంటే ఏ అంశంలోనూ తక్కువ కాదని అన్ని రంగాల్లోనూ సమానమేనని ఆయన అన్నారు.స్వశక్తితో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో మహిళలు, చిన్నారుల పట్ల వేధింపులు పెరిగిపోతున్నాయని ఈ అంశంపై మన పిల్లలకు అవగాహన కలిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అసమానతలు లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలి అని ఆయన అన్నారు.



## ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 350 చర్చిలకు సొంత నిధులతో క్రిస్మస్ కేకుల పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి

ఏసుక్రీస్తు బోధనలు సదా ఆచరణీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో..నియోజకవర్గ పరిధిలోని 350 చర్చిలకు సొంత నిధులతో కేకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతికి, ప్రేమకు క్రిస్మస్ పండుగ ప్రతీక అని అన్నారు. దశాబ్ద కాలంగా నియోజకవర్గ పరిధిలోని ప్రతి చర్చికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సొంత నిధులతో నూతన చర్చిల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో క్రిస్టియన్లకు తగు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్, తదితరులు పాల్గొన్నారు.



## క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా ,విశాలభారతి:

ఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల పాస్టర్ లకు బండారి లక్ష్మారెడ్డి దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మానవుడిలో ప్రేమ ,క్షమగుణం పెంపొందాలి అనే క్రీస్తు ఆలోచన విధానం నిత్యం ఆచరణనియం అని ఆయన చెప్పారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన తెలిపారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణమయుడని అన్నారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తన రక్తం చిందించిన ధీశాలి యేసుక్రీస్తు ప్రభువు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం,
25.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మేకల చోరీ ఫిర్యాదుతో కేసు నమోదు

**ఆమనగల్లు, విశాల భారతి :**

మాడుగుల మండలం ఇర్విన్ గ్రామంలో మేకల కాపరి మల్లేశ్కు చెందిన 5 మేకలు మంగళవారం తెల్లవారుజామున చోరీకి గురైనట్లు సీఐ జగదీష్ చెప్పారు. యజమాని తనకున్న మేకలను మేపుకొని వచ్చి సాయంత్రం ఇంటి వద్ద షెడ్డులో కట్టేసి మంగళవారం తెల్లవారు జామున వెళ్లి చూడగా అందులోని 5 మేకలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.



## ఆంధ్రా ఫిల్మ్ ఇండస్ట్రీ వైజాగ్ వెళ్ళిపోవాలి

- **డి -జాక్ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్**

**సికింద్రాబాద్, విశాలభారతి:**

తెలంగాణ సినిమా ఇండస్ట్రీని 1956 నుండి దోపిడీ చేసి లక్షల కోట్లు సంపాదించిన ఆంధ్రా ఫిల్మ్ ఇండస్ట్రీ తక్షణమే వైజాగ్ కు తరలి పోవాలని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తెలుగు ఫిల్మ్ డైరెక్టర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కస్తూరి శ్రీనివాస్ తెలంగాణ సినీ మ్యూజిషియన్ యూనియన్ అధ్యక్షులు రమణ ఓగేటి చిత్రపురి సాధన సమితి జనరల్ సెక్రటరీ డాక్టర్ సియచ్. భద్ర తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్ విష్ణుకిషోర్ డైరెక్టర్ జి జె రాజా ,కెఎస్ రెడ్డి స్టూడియో అధినేత కె. శ్రీనివాస్ రెడ్డి లు అన్నారు. మంగళవారం తార్నాక లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ వచ్చి 11 ఏళ్ళు గడిచినా ఇక్కడే పరన్నా జీవుల్లా తీస్తావేసి తెలంగాణ కవులు కళాకారులు నిర్మాతలు హీరో హీరోయిన్లు కార్మికులు కర్షకుల అవకాశలను దోపిడీ చేసిన ఆంధ్రా సినిమా ఇండస్ట్రీ దొంగలు కామన్ కాపిటల్ పీరియడ్ అయిపోయినా ఏపీ సీఎం డిప్యూటీ సీఎం రమ్మని పిలిచినా ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. పూష్పా సినిమా ప్రీమియర్ షోలోఆంధ్రా హీరో అల్లు అర్జున్ ఓవర్ యాక్షన్ కారణం గా బలిఅయినా రేవతి కుటుంభానికి న్యాయం కోసమే ఓయూ విధ్యార్థులు అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసారని మీరు ఆంధ్రా వెళ్లకపోతే యావత్ తెలంగాణ సమాసజం మీ పై యుద్ధం ప్రకటిస్తుందని ఆయన హెచ్చరించారు.



## ఇందిరమ్మ ఇళ్ళ ఇంటింటి సర్వే

**ఆమనగల్లు, విశాల భారతి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ళ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ లో ముమ్మరంగా కొనసాగుతోంది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మేడిగడ్డ తాండలో జరుగుతున్న సర్వేను ఇందిరమ్మ ఇళ్ల కమిటి సభ్యులు విజయ్ రాథోడ్, హరిలాల్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ రాథోడ్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొదటి విడతలో ఒంటరి మహిళలకు, పూరి ఇండ్లలో నివసించేవారికి, అసలు ఇండ్లు లేని వారికి ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులకు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, కేళి, బుజ్జి,విజయ,ధన లక్ష్మి,,దొలి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సారా స్థావరాలపై పోలీసుల దాడులు

- **ఎస్ ఐ ఊర సృజన్ కుమార్**

**దేవరప్పుల, విశాల భారతి**



దేవరుప్పుల మండలంలోని సారా బట్టిలపై దాడులు నిర్వహించినట్లు దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపారు. మండలంలోని నల్లకుంట తండాకు చెందిన బానోత్ బుజ్జి భానోత్ జ్యోతిల ఇంట్లో గుడుంబా తయారు చేయడానికి బెల్లం పాకం నిలువ చేసిందని, సమాచారం రాగా అక్కడికి వెళ్లి చూసేసరికి 100, 70 లీటర్ల బెల్లం పాకం నిలువ చేసి ఉండగా, వాటిని ధ్వంసం చేసి వారిపై చట్టరీత్యా చర్య కోసం ఎక్సైజ్ శాఖకు అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోకి బెల్లం రవాణా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, సార కాసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తామని అన్నారు. ఈ ఆపరేషన్ లో దేవరుప్పుల పోలీస్ సిబ్బంది, యాకేష్, మసూద్ లు పాల్గొన్నారు.



## ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

**ఆమనగల్లు, విశాల భారతి :**

లోక రక్షకుడు.. ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు అమనగల్లు పట్టణ కేంద్రంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇళ్ల ఎదుట నక్షత్రాలు, ఇళ్లలో క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆరాధకులు సంబురాలను ప్రారంభించారు. నృత్యాలు, శాంతి సందేశాలు, ప్రేమ సూక్తులు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. శాంతా క్లాజ్, మేరీమాత బొమ్మలతో పాటు స్టార్లు, ట్రీలు, విద్యుత్ దీపాలు తదితర కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఫ్యాన్సీ స్టోర్లు జనంతో కిటకిటలాడుతున్నాయి.

## ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్

- **తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**

**సూర్యాపేట, విశాల భారతి**



ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని ప్రజలంతా శాంతి సామరస్యాలతో ఎదుటివారిపై జాలి కరుణ చూపాలని ఏసుక్రీస్తు చాటి చెప్పాడని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 35వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య కరుణాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో భారీ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని కుమారుడిగా ఏసుప్రభువు జన్మించి ప్రజలను పాపాల నుంచి కాపాడి సిలువతో మరణం పొంది మరల ప్రజల కోసం జన్మించాడన్నారు. ఏసుక్రీస్తు కృపతో అందరికీ మంచి జరగాలని ప్రజలంతా శాంతి మతసామరస్యంతో ఆనందంగా ఉండాలని కోరారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చర్చిలను క్రైస్తవుల ఆస్తులను రక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. క్రైస్తవులకు చర్చిని ముస్లింలకు ఒక మసీదుని అభివృద్ధి చేయాలని ఆశయంతో తాను ముందుకు పోతున్నానని అందులో భాగంగా సూర్యాపేట సెంటినరీ బాప్టిస్ట్ చర్చిని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానన్నారు. ఇప్పటికే హిందువులకు పిల్లలమర్రి ఉండ్రుగొండ దేవాలయాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ప్రభుదాస్ తో మాట్లాడి సమస్యలు తెలుసుకుని త్వరలో బ్రహ్మాండంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎం ప్రభుదాస్, చర్చి కమిటీ అధ్యక్షులు జాన్ సుమిత్ర, మర్రి నెహెమ్యా, నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ కౌన్సిలర్ షఫీ ఉల్ల, జ్యోతి శ్రీవిద్య కరుణాకర్, ఫారూక్, నిమ్మల వెంకన్న, బైరబోయిన శ్రీనివాస్, తండు శ్రీనివాస్, వల్దాస్ దేవేందర్ తదితరులు ఉన్నారు.



## నిరుపేదలకు వరం సీఎం సహాయక నిధి

**మునుగోడు విశాల భారతి**

రత్తిపల్లి గ్రామానికి చెందిన రడం భారతికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 25,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం రత్తిపల్లి మాజీ సర్పంచ్ మాధగోని రాజేష్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గాదె భిక్షమయ్య, పుణ్ణం లింగయ్య, గాదె శ్రీను, గాదె శంకరయ్య, బొమ్మగోని రామచంద్రం, రడం నర్సింగ్ రావు, రాములు, గాదె పాండు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆనందోత్సహాలతో క్రిస్మస్ పండుగని జరుపుకోవాలి

- **ఏసు ప్రభువు బోధించిన శాంతి సందేశం మానవాళి మనుగడకు మార్గనిర్దేశం**
- **క్రైస్తవ, సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు**
- **రాంరెడ్డి దామోదర్ రెడ్డి**

**సూర్యాపేట, విశాల భారతి**



సూర్యాపేట నియోజకవర్గ క్రైస్తవ సోదర సోదరీమణులు ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ మాజీమంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కోసం పుట్టిన మహనీయుడని, గొప్ప శాంతి దూత అని దామన్న పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ శుభ సందర్భంగా అందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. క్రిస్మస్ వేడుకలు ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్ని నింపాలని, ఇంటింటా అనంద కాంతులు వెల్లివిరియాలని వారు శాంతి మార్గంలో పయనించేలా ప్రేమను చూపారని, వారి మార్గం అందరికీ ఆదర్శనీయమని, ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించాలని కోరారు. ఆనందోత్సహాలతో క్రిస్మస్ పండుగని జరుపుకోవాలి

## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- **సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**

**కురవి, విశాలభారతి:**

రాజ్యాంగాన్ని మార్చాలనే, అమిత్ షా లాంటి వారు అంబేద్కర్ ని అవమానించే విధంగా ప్రవర్తించే, మనువాదుల దాడిని తిప్పి కొట్టడానికి ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ కురవి మండల కౌన్సిల్ సమావేశం పార్టీ కార్యాలయంలో జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాలకు హక్కులు కల్పించిన అంబేద్కర్ లాంటి మహనీయున్ని సాక్షాత్తు దేశ హోమ్ మినిస్టర్ అవమానించడం అంటే దేశంలోని కోట్లాదిమంది దళిత గిరిజన బలహీన వర్గాలను అవమానించినట్లేనని, గత పదిహేళ్లుగా బిజెపి వ్యూహాత్మకంగా, లౌకిక ప్రజాస్వామిక, సమాఖ్య, విధానాలను నిర్వీర్యపరచడానికి బరితెగించి ప్రయత్నాలు కొనసాగిస్తుందని, భారత రాజ్యాంగ స్థానంలో మనువాదాన్ని స్థాపించడానికి చేసే ప్రయత్నాలను ప్రగతిశీల శక్తులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ 99 ఏళ్ల ఆవిర్భావ ఉత్సవాలను ఈనెల 26వ తారీఖున ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న, దొంతు రామ్మూర్తి ,దూది కట్ల సారయ్య,బొల్లం ఉప్పలయ్య, కురియాల వీరన్న, తదితరులు పాల్గొన్నారు



## రవి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేత

- **పెద్ది కృష్ణమూర్తి గౌడ్**

**దేవరుప్పుల, విశాల భారతి**

దేవరుప్పుల మండలం, మన్ పహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మోలుగూరి రవి ఇటీవల మరణించగా మంగళవారం దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది క్రిష్ణమూర్తి గౌడ్ వారి ఇంటికి వెళ్ళి వారి చిత్రపటానికి పూలు చల్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసారు. వారివెంట మాజీ ఎంపీటీసీ మహ్మద్ జాకీర్ హుస్సేన్, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, మాజీ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పుల అనిల్, మన్ పహాడ్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జోగు యాకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ షబ్బీర్ అలీ,మాసంపెల్లి మహేందర్, చీకటి యకన్న, దావుల యాకన్న, కడారీ శేఖర్,జోగు మల్లయ్య,నూనె కుమారస్వామి,సీత మల్లేష్,ముత్యాల శివనాద్,చీకటి యాదయ్య,చింతకింది యాదయ్య,వర్రే ఉప్పన్న,జోగు ఉప్పన్న,సీత శేఖర్,జోగు శ్రీకాంత్,వెల్పుగొండ చంద్రయ్య, వేల్పుగొండ పవన్, కడవెండి యూత్ అధ్యక్షుడు సుడిగాల నరేష్,తోటకూరి రమేష్,చింత ఎల్లయ్య,తోటకూరి మహేష్,చింత ప్రవీణ్, పత్తేపురపు శేఖర్, తదితరున్నారు.



## పెద్దగట్టు జాతర ప్రాంగణం పరిశీలన

- **జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**

**సూర్యాపేట, విశాల భారతి**

త్వరలో జరగనున్న దురాజుపల్లి పెద్దగట్టు జాతర పరిసరాలను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పరిశీలించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జాతర పరిసరాలను, దేవాలయ ప్రదేశాన్ని, రోడ్డు మార్గాలను, భక్తులు వేచి ఉండే స్థలాలు వాహనాల పార్కింగ్ ప్రవేశాల స్థితిగతులను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. జాతరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగినదని, ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తామని, పెద్దగట్టు జాతర పోలీసు బందోబస్తు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించాలని స్థానిక పోలీస్ అధికారులకు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తెలిపారు. జాతీయ రహదారి వెంట వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంగా పని చేయాలని తెలిపారు. జాతర ప్రాంగణంలో కావాల్సిన రక్షణ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకోవాలని, ఇతర శాఖలతో సమన్వయంతో ముందుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. బందోబస్తు ప్రణాళిక పై స్పెషల్ బ్రాంచ్ దృష్టి పెట్టి పని చేయాలని అన్నారు. అనంతరం దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డియస్పి రవి, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, చివ్వేంల ఎస్సై మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
25.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# అమిత్ షా క్షమాపణ చెప్పాలి

**రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** భారతదేశ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని అవహేళన చేస్తూ మాట్లాడినటువంటి మాటలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అమిత్ షాను తక్షణమే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని కోరుతూ..మంగళవారం కొంగర కలాన్ Dr,BR అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేసి అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి ,నారాయణ రెడ్డికి వినతిపత్రం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మరియు కసిరెడ్డి నారాయణ రెడ్డి,వీర్లపల్లి శంకర్ తో పాటు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు,మార్కెట్ చైర్మన్లు చిలుక మధుసుధన్ రెడ్డి, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పండుగల జయశ్రీ రాజు చైర్మన్లు, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి,పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి మరియు కౌన్సిలర్లు,మాజీ ZP చైర్మన్,జెపిటీసీలు,మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల నాయకులు అనుబంధ సంఘాల శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ఆమనగల్లు, విశాలభారతి :** ఆమనగల్లు మండలం రామ్నుంతల పెద్ద తండాలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ను మాజీ ప్రజాప్రతినిధులు శ్రీను, సరిత పంతు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం వారు చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని క్రిస్టియన్ సోదరులతో కలిసి భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో శ్రీధర్, బుక్య నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

- భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు
- కలెక్టర్ ప్రావీణ్య



**భీమదేవరపల్లి, విశాల భారతి** వచ్చే నెల 10 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల (జాతర) ఏర్పాట్ల సమీక్షపై అన్ని శాఖల అధికారుల తో మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య కొత్తకొండ లో సమావేశం అయ్యారు. ముందుగా ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. కళ్యాణ మండపంలో కొత్తకొండ ఆలయ ఈవో కిషన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే జనవరి 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, రోడ్లు భవనాలు, విద్యుత్తు, దేవాదాయ, పర్యాటక తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది హోదా వారి మొబైల్ నెంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాథోడ్ రమేష్, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, ఏసీపీ తిరుమాల్ రావు, ఎమ్మార్వో ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, ఎల్కతుర్తి సీఐ రమేష్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పేటలో తెలంగాణ పద్మశాలి సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం

**సూర్యాపేట, విశాల భారతి** సూర్యాపేట పట్టణంలోని 44వ వార్డులో గల మిట్ట కోల సతీష్ భవన్ లో సంఘ జిల్లా కార్యాలయాన్ని మంగళవారం తెలంగాణ పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కామర్థపు మురళి ప్రారంభించారు. సూర్యాపేట పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్షులు మిట్ట కోళ్ల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ తెలంగాణ పద్మశాలి సంఘ బలోపేతానికి, సమస్యలపై పోరాడుతానని, సంఘ కుల బాంధవులందరూ ఐక్యంగా ఉండాలని, త్వరలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాటు జరిగేలా చూస్తానని, సంఘం కార్యక్రమాలకు.. నాయకులు సభ్యులు చిన్న పెద్ద తేడా అనే లేకుండా పెద్ద ఎత్తున హాజరై అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయాలని.. ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం సంఘ ముఖ్య నాయకులు అందరూ సూర్యాపేట పురపాలక సంఘ కమిషనర్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొడ్డు గోవిందరావు, పట్టణ అధ్యక్షులు మిట్ట కోళ్ల సతీష్, మహిళా అధ్యక్షురాలు నక్క రమాదేవి,ఉపాధ్యక్షులు కోట వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఏలే ప్రభాకర్, కోశాధికారి మిట్ట కోళ్ల మధు,ఎలగందుల శ్రీనివాస్, మిట్ట కోళ్ల రవి, యువజన అధ్యక్షులు సిలువేరు సతీష్, వరకాల శ్రీనివాస్, కొండలరావు,చందా హేమలత,కోట నవీన్,కోట ప్రవీణ్, ఏలే వెంకన్న,కోట వీరయ్యపాల్గొన్నారు.



# తుర్కయంజాల్ రైతు సహకార సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

- టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

**తుర్కయంజాల్, విశాలభారతి :** తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం నూతన క్యాలెండరు (2025)ను మంగళవారం టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించడమే సహకార సంఘాల లక్ష్య అన్నారు. సహకార సంఘాల సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మా రెడ్డి, సంఘం డైరెక్టర్ లు సామ సంజీవరెడ్డి, కృష్ణా రెడ్డి, లక్ష్మమ్మ, కార్యదర్శి రాందాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ వస్తువులు, యాప్స్ పై ప్రజలకి అవగాహన కల్పించాలి

- వినియోగ దారుల ఫోరం ద్వారా ఉచిత సేవలు
- జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు




**సూర్యాపేట, విశాలభారతి** నకిలీ వస్తువులు, యాప్స్ పై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల అధికారి డి. రాజేశ్వర్ తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు జాతీయ వినియోగ దారుల దినోత్సవంను డిజిటల్ వినియోగం, వర్చువల్ విచారణ ద్వారా వినియోగదారుల న్యాయం అనే థీమ్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి వస్తువు ఆన్ లైన్ ద్వారానే కొనుగోలు చేస్తున్నామని, ఏది నకిలీ వస్తువో గుర్తించటం చాలా కష్టం కాబట్టి ప్రభుత్వ అనుమతులు ఉన్న యాప్స్ ను, వెబ్ సైట్ల ద్వారా మాత్రమే మొబైల్ లో ఉపయోగించాలని తెలిపారు. ఏమైనా నకిలీ వస్తువులు గుర్తిస్తే నల్గొండలో గల వినియోగదారుల ఫోరం నందు పిర్యాదు చేయాలని, అక్కడ వినియోగదారులకి ఉచితంగా సేవలు అందించి వినియోగదారులకు సత్వర న్యాయం అందుతుందని అన్నారు. ఆన్ లైన్ లో సైబర్ మోసాల ద్వారా డబ్బులు కోల్పోతే గంట లోపల దగ్గరగల పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు డి.ప్రేమ్ సాగర్, అసిస్టెంట్ డి ఎస్ ఓ శ్రీనివాసరెడ్డి, రేషన్ డీలర్లు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్లు ఫోర్జరి చేస్తున్నా వ్యక్తుల అరెస్ట్



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్ పేట్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు ఫోర్జరీ డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 1)ముడవత్ దీప్లా నాయక్ తండ్రి బిక్కు, నివాసం గ్రీన్ పార్క్ కాలనీ, కర్మాన్ఘాట్ 2) కీతవత్ పూల్ సింగ్ తండ్రి పాండ్యా, నివాసం నందనవనం 3)మాచగోని రంగయ్య తండ్రి సైదులు, నివాసం అబ్దుల్లాపూర్ మెట్ మరియు బిరాదర్ మారుతి, స్వామి నాయక్, రమేష్ నాయక్ మరియు మరి కొంతమంది వ్యక్తులు కలిసి చాలాకాలంగా ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగని ప్లాట్లను గుర్తించి, అట్టి ప్లాట్ల యొక్క సీసీ కాపీ ల ద్వారా ఒరిజినల్ డాక్యుమెంట్ లాగా ఫోర్జరీ డాక్యుమెంట్ తయారు చేసి అట్టి డాక్యుమెంట్స్ ద్వారా అమాయకులను మోసం చేసి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. గండి చెరువు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 183, 186, 187, 188, 189 లాలోని చాలాకాలంగా రిజిస్ట్రేషన్ జరగని కొన్ని ప్లాట్లను వీరు గుర్తించి అట్టి ప్లాట్ ల యొక్క సీసీ కాపీ ద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్ తయారు చేసి నకిలీ వ్యక్తుల ద్వారా మరియు ఫోర్జరీ డాక్యుమెంట్ల ద్వారా ఉషాకిరణ్ మూవీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి మరియు మార్గదర్శి ఫైనాన్స్ వారికి విక్రయించడం జరిగింది. వీరు చేస్తున్న మోసంను గుర్తించిన ఒక ఫ్లాట్ ఓనర్ వాణి భర్త శ్యామ్ ప్రసాద్ ఫిర్యాదు పై వారందరిపై కేసు నమోదు చేసి మూడవత్ దీప్లా నాయక్, కితావత్ పూల్ సింగ్ మరియు రంగయ్య లను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



# కాంట్రాక్టు ఉపాధ్యాయులు నిరవధిక సమ్మె

- ఎటిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సప్కా నాగరాజు

**వాజేడు, విశాలభారతి:** ఐటిడిఎ ఏటూరు నాగారం కార్యాలయం ముందు కాంట్రాక్టు ఉపాధ్యాయులు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఎటిఎఫ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ సప్కా నాగరాజు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలకు పైగా ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ గిరిజన విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి నిరంతరం గా తోడ్పడుతూ శ్రమ దోపిడీకి గురి అవుతున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలి. న్యాయ పరమైన డిమాండ్స్ తెలంగాణ రాష్ట ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా కాంట్రాక్టు ఉపాధ్యాయుల ను రెగ్యులర్ చేయాలి. ఈ కార్యక్రమంలో సి ఆర్ టి ల రాష్ట్ర అధ్యక్షుడు సోమేశ్వర్, రాష్ట ఉపాధ్యక్షులు రవీందర్,జిల్లా అధ్యక్షులు కొండ రామయ్య, వివిధ పాఠశాలల కాంట్రాక్టు ఉపాధ్యాయులు పాల్గన్నారు.



# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**`తొర్రూరు, విశాలభారతి:** తొర్రూరు కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొర్రూరు, పెద్దవంగర, తొర్రూరు పట్టణానికి వివిధ గ్రామాలకు సంబంధించిన 46 మంది బాధితులకు మంజూరైన 15,13,000 రూ సీఎం సహాయనిది చెక్కులను బాధితులకు పంపిణీ చేసిన పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, వైద్య చికిత్సల కోసం లేదా అత్యవసర సమయంలో ఆర్థిక సహాయం అవసరమైన సందర్భాల్లో సీఎం సహాయనిధి ద్వారా అందిస్తున్న సాయాన్ని వారు విశేషంగా కొనియాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వారు వెల్లడించారు, సీఎం సహాయనిధి పథకం, కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా,సంక్షోభ సమయాల్లో ప్రజలకు ఆశాకిరణంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, బ్లాక్ మరియు మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, అనుబంధ సంఘ నాయకులు,మహిళ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుంది

- ఎమ్మెల్యే మందుల సామేలు



**శాలిగౌరారం, విశాలభారతి:** మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మందుల సామేలు మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 106 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మందుల సామేలు అందజేశారు. మండల తహసిల్దార్ యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సబ్సిడీతో గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, రానున్న రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన నూతన కాంగ్రెస్ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్, ఆర్ ఐ అజారుద్దీన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గూని వెంకటయ్య, జైపాల్ రెడ్డి,నరిగే నరసింహ, బందారు మల్లయ్య, బోడ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం,
25.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండగ క్రిస్మస్

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు



**మునుగోడు, విశాలభారతి**

మునుగోడు నియోజకవర్గ క్రైస్తవ సోదర సోదరీమణులు ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



# వలస కార్మికులను ఆదుకోవాలి

- వలస కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొడ్డు వెంకన్న

**డోర్నకల్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రంలో పాలు రంగాలలో పనిచేస్తున్న వలస కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చి వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వలస కార్మిక సంఘం (సిఐటియు అనుబంధ యూనియన్) రాష్ట్ర నాయకులు బొడ్డు వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడ పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై వారు సర్వే చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కరోనా కాలంలో అనేకమంది కార్మికులు అనారోగ్యానికి గురై అవస్థలు పడినట్లు తెలిపారు. యాంత్రికరణ పద్ధతులు వచ్చిన తర్వాత భవన నిర్మాణ రంగంలో రోజురోజుకు పని దినాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల్ని ఆదుకుంటామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న వారిని పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. వలస కార్మికులు గత అనేక సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో స్థిరపడి కార్మిక రంగంలో భవన నిర్మాణ రంగంలో శ్రమను ధారపోస్తుండగా ప్రభుత్వాలు వారికి తగిన గుర్తింపును కల్పించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వలస కార్మికులను గుర్తించి వారికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులతో పాటు, ఆదుకోవాలని కోరారు. అనేక ఏళ్ల నుండి ఇక్కడే స్థిర నివాసం ఉంటున్న కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య, మార్బుల్స్ యూనియన్ నాయకులు పటాన్ పాషా, బి రాంబాబు, బానోతు కాంతమ్మ, బానోతు సునీత తదితరులు ఉన్నారు.



# పినపాక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన జర్నలిస్టులు

**మణుగూరు, విశాలభారతి:**

పినపాక నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు మణుగూరు కి చెందిన జర్నలిస్టులు మంగళవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లను కలిసి ప్రత్యేక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ఇండ్ల స్థలం కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల కృషిని గుర్తించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. పాయం వెంకటేశ్వర్లు ఈ విషయాన్ని గమనించి, అనుకూల చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. వారంతా ఈ వినతిపత్రం ద్వారా తమ ఆశయాలను తెలియజేశారు.



# మనువాదుల గుండెల్లో తుపాకీ తూటా పెరియార్

- డాక్టర్ భాను ప్రసాద్

**అశ్వాపురం, విశాలభారతి:**

స్థానిక బిఆర్ అంబేద్కర్ హాస్పిటల్ నందు మంగళవారం నాడు మహాజన మహిళా సమైక్య ఎంఎంఎస్ ఆధ్వర్యంలో సాంఘిక విప్లవ నేత పెరియార్ రామస్వామి 51 వ వర్ధంతి సందర్భంగా పెరియార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు సామాజిక ఉద్యమకారులు ప్రముఖ హేతువాది డాక్టర్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ ప్రజలకు స్త్రీలకు గౌరవం లేకుండా కులం, మతం పేరుతో ఏళ్ల నుంచి అసమానతలకు కారణమైన మనువాద వ్యవస్థపై ఆత్మగౌరవ పోరాటం చేసిన వ్యక్తి పెరియార్ రామస్వామి అన్నారు. సమాజాన్ని కులాల పేరుతో విడదీసి, ఆత్మగౌరవం లేకుండా అవమాన పరిచిన మనువాదుల గుండెల్లో తుపాకీ తూటగా మారిన గొప్ప సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి అని కొనియాడారు. పేదలకు ఆత్మగౌరవం దక్కినప్పుడే సమాజంలో అసమానతలు తొలగి అందరికీ సమాన హక్కులు ఉంటాయని చెప్పిన పెరియార్ రామస్వామి నేటి సమాజానికి ఆదర్శం అన్నారు. ప్రతీ ఒక్కరు పెరియార్ మార్గంలో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు మేకల లత, ఉపాధ్యక్షురాలు కొచ్చర్ల కుమారి, కార్యదర్శి కొప్పుల నాగమణి,కోట ప్రశాంతి, రమణమ్మ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు అలవాల రాజా పెరియార్, కొప్పుల తిరుపతి, భద్రాచలం పట్టణ ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు,కొవ్వాల రవి, మేడ్చెర్ల లక్ష్మణ్, అంబోజి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో ఆధ్యాత్మిక శాస్త్రాన్ని తీసురావాలి

- పిరమిడ్ వ్యాలీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు శ్రేయన్స్ దాగా
- మన ఆలోచనలే వాస్తవ రూపం దాలుస్తాయి
- బుద్ధ సీఈవో, క్వాంటమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్
- ధ్యానులను ఆకట్టుకుంటున్న యోగా, వేద పఠనం, సంగీత నాధ ధ్యానం
- ధ్యాన ఉస్మానియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఓయూ రాము
- యాగంలో విజయవంతంగా ట్రూత్ ఫర్ యూత్ కార్యక్రమం



**ఆమనగల్లు, విశాల భారతి :**

కడ్తాల్ లోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహా యాగం కార్యక్రమంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న ట్రూత్ ఫర్ యూత్ అనే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, మోటివేషనల్ స్పీకర్లు పాల్గొని తమ సందేశాల ద్వారా యువతకు అద్భుతమైన ఆత్మజ్ఞానాన్ని అందిస్తున్నారు. పత్రీజీ ధ్యాన మహా యాగం నాలుగో రోజు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ధ్యాన ఉస్మానియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఓయూ రాము పాల్గొని మాట్లాడారు. బ్రహ్మర్షి పత్రీజీ అత్యంత సులువుగా ఆత్మజ్ఞానాన్ని అతి సామాన్యులకు కూడా అందించిన గొప్ప గురువు అని కొనియాడారు. మన ఆలోచనలే అన్నింటికి మూలమని తెలియజేసారు. తాను ధ్యాన మార్గంలోకి ఎప్పుడు వచ్చారు, ఎందుకు వచ్చారు అనే విషయాలను తెలియజేసారు. అనంతరం బుద్ధ సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మన ఆలోచనలే వాస్తవ రూపం దాలుస్తాయని తెలిపారు. సానుకూల ఆలోచనల ద్వారా ఏదైనా సాధించవచ్చునని తెలియజేసారు. ధ్యాన సాధనతో మన జీవిత ధ్యేయం తెలుస్తుందన్నారు. యువత పరిమిత నమ్మకాలను వదిలిస్తే ఏదైన చేయగలరని సూచించారు. అనంతరం సీనియర్ పిరమిడ్ మాస్టర్ అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఆత్మవిద్యయే అసలైన విద్య అని, విద్యా వ్యవస్థలోకి ఆధ్యాత్మిక శాస్త్రాన్ని తీసురావాలని బ్రహ్మర్షి పత్రీజీ చెప్పేవారని గుర్తు చేసారు. అనంతరం మోటివేషనల్ స్పీకర్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ మనిషి విజయం సాధించాలంటే ఏమీ చేయాలి? ఎలాంటి క్వాలిటీస్ ఉండాలని అనే విషయాల గురించి వివరించి, ధ్యానులు, యువతకు జ్ఞానాన్ని అందించారు. నిర్వహిస్తున్న యోగా, వేదపఠనం, సంగీత నాధ ధ్యానం కార్యక్రమాలు ధ్యానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. యోగా నిపుణులు వెంకటేశ్ యోగా ఆసనాలు, ముద్రలు, చక్రాలు గురించి అధ్భుతంగా వివరిస్తున్నారు .అలాగే చైతన్య, మాస్టర్ తేజాలు అధ్భుతంగా వేదపఠనం చేసి ధ్యానులకు అధ్బుతమైన వేద జ్ఞానాన్ని అందిస్తున్నారు. మరోవైపు మ్యూజిక్ డైరెక్టర్ సంజయ్ కింగ్ బృందం ప్రదర్శిస్తున్న సంగీత నాద ధ్యానం ధ్యానులను ఊర్రూతలూగిస్తుంది. ధ్యానులు, మాస్టర్లు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తాము చేస్తున్న ధ్యాన, ఆత్మ జ్ఞాన కార్యక్రమాలు, అలాగే భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎస్.హన్మంత్ రావు తమ బృందంతో పాల్గొని జిల్లాలో తాము చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే నాగర్ కర్నూల్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ తిరుపతియ్య, సిద్దిపేట సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఈశ్వరయ్య, కొనసీమ జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎన్.విజయభాస్కర్ రెడ్డి, చిత్తూరు జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ హరినాథ్ బాబులు తమ బృందాలతో పాల్గొని తమ జిల్లాలో ధ్యాన విస్తరణకు తాము చేస్తున్న, అలాగే చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. మ్యానిఫెస్టేషన్ అనే అంశంపై నిర్వహించిన ప్యానెల్ డిస్కషన్ కార్యక్రమం అధ్బుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బుద్ధ సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్, బెంగళూరు పిరమిడ్ వ్యాలీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు శ్రేయన్స్ దాగా, పిరమిడ్ వ్యాలీ ట్రస్టీ సాయి కృపా సాగర్, పీఎంసీ హిందీ డైరెక్టర్ రామారాజు, అనువాదకురాలు స్వర్ణలత, లైఫ్ కోచ్ డెనిషా, సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టేషన్ అంటే ఏమీటి, మ్యానిఫెస్టేషన్ ఎలా చేయాలి, మ్యానిఫెస్టేషన్ ద్వారా మనం అనుకున్నది ఎలా సాధించాలనే విషయాల గురించి తెలియజేసి జ్ఞానాన్ని అందించారు.



# కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**డోర్నకల్, విశాలభారతి:**

దంతాలపల్లి మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ (వీడిసి) చైర్మన్ హైకోర్టు న్యాయవాది జెట్టి ఆజాద్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సిడిపిఓ ఎల్లమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, స్వయం ఉపాధితో తమ స్వసక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మహిళల కోసం ఉచితంగా కుట్టు మిషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రామ అభివృద్ధి కమిటీ సేవలు అభినందనీయం అన్నారు. మహిళలు,యువతులు కుట్టు మిషన్ శిక్షణను పొంది, అందరూ కలిసి ఒక సంఘంగా ఏర్పాటై ఒక పెద్ద కుట్టు మిషన్ సంస్థను ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. వీడిసి చైర్మన్ హైకోర్టు న్యాయవాది జెట్టి ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బీరిశెట్టిగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా గత కొన్ని సంవత్సరాల నుండి సుమారు 30 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి వివిధ అభివృద్ధి,సంక్షేమ,సేవా కార్యక్రమాలను చేపట్టానని, రాబోవు రోజుల్లో కూడా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మన గ్రామానికి రాష్ట్రంలో ప్రత్యేకమైనటువంటి స్థానాన్ని కల్పించుటకు కృషి చేస్తానని, అందులో భాగంగా ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో మహిళలు సొసైటీతో ఆర్థికంగా అభివృద్ధి చెంది తమ కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవించాలనే ఉద్దేశంతో గ్రామంలో ఆసక్తి ఉన్న మహిళలు,యువతులకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టమిషన్ శిక్షణను ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, కానిస్టేబుల్ స్వాతి పాల్గొన్నారు.

# బస్సు సర్వీసును పునరుద్ధరించాలని డిఎంకు విజ్ఞప్తి

**తొర్రూరు, విశాలభారతి:**

పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆదేశానుసారం తొర్రూరు డిపో మేనేజర్ ని కలిసిన సందర్భంగా గత 15 సంవత్సరాలుగా తొర్రూరు బస్టాండ్ నుండి బోరబండకు నైట్ హాల్ట్ బస్సు సర్వీసు ఉండేది,ప్రస్తుతం ఇప్పుడు ఆ బస్సును కొనసాగించకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.ప్రయాణికుల ఇబ్బంది దృష్ట్యా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశానుసారం ఉన్నటువంటి నైట్ హాల్ట్ బోరబండ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని గ్రామ పార్టీ అధ్యక్షుల సమక్షంలో డిపో మేనేజర్ పద్మావతిని, ట్రాఫిక్ సూపరిండెంట్ రజిత రెడ్డిని విన్నపం చేయడం జరిగింది. విన్నపంను అధికారులు సానుకూలంగా స్పందించి సర్వీసు కొనసాగిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు వెన్నం సోమిరెడ్డి,ప్రతికంఠం దేవేందర్ రాజు,వెంకట్ రెడ్డి, రమేష్ లు పాల్గొన్నారు.



# హోరాహోరీగా అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్

**అశ్వాపురం, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రికెట్ మైదానంలో జరుగుతున్న అంబేద్కర్ 4 వ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం 3 వ రోజు మిట్టగూడెం లెవన్ వర్సెస్, అశ్వాపురం ఎమ్మార్పీఎస్ లేవెన్ జట్ల మధ్య జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన అశ్వాపురం ఎమ్మార్పీఎస్ జట్టు నిర్ణీత ఓవర్లలో 49 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మిట్టగూడెం జట్టు 47 పరుగులు సాధించి ఓటమి పొందింది.అనంతరం జరిగిన రెండో మ్యాచ్ లో అశ్వాపురం ఎమ్మార్పీఎస్ బి జట్టు, కొమ్ముగూడెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో కొమ్ముగూడెం జట్టు నిర్నిత ఓవర్లలో 53 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అశ్వాపురం ఎమ్మార్పీఎస్ బి జట్టు 54 పరుగులు సాధించి విజయం సాధించింది. అశ్వాపురం ఎమ్మార్పీఎస్ బి జట్టు క్రీడాకారుడు గద్దల బంగారం 12 బంతుల్లో 33 పరుగులు సాధించి ప్రతిభ కనబరిచిన గద్దల బంగారం కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు కొమ్ము మహేష్ నాగరాజు, కంచర్ల రవి, అంగోత్ సురేష్, కోల నవీన్, తదితరు పాల్గొన్నారు.



# ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- పంచాయితీ కార్యదర్శి జైపాల్ రెడ్డి

**పినపాక, విశాలభారతి:**

మండలంలోని ఏడూళ్ల బయ్యారంలో గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే అధికారులు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి గృహాలు లేని వారిని గుర్తించి వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధి కార్యదర్శి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ పినపాక మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుందని అర్హులైన లబ్ధిదారుల వివరాలు సేకరించి ఇందిరమ్మ కమిటీ సభ్యులను భాగస్వాములను చేస్తూ నిబంధనల ప్రకారం సర్వే చేస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లుల విషయంలో ప్రభుత్వం సూచించిన ప్రకారమే సర్వే నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఆధార్ కార్డు, ఇంటిపన్ను, లేదా కరెంట్ బిల్ కావలసి వుంటుంది అని ఆయన గ్రామస్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతిని పంచాయితీ కార్యదర్శి జైపాల్ రెడ్డి, పంచాయతీ గుమస్తా సంపత్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా

బుధవారం,
25.12.2024
హైదరాబాద్




cinema updates

# 'చిన్ని' విడుదల




వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస భారీ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, ఈ సంక్రాంతికి మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. బాలకృష్ణ మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపిస్తున్న 'డాకు మహారాజ్'పై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టైటిల్ టీజర్ విశేషంగా ఆకట్టుకున్నాయి. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి, ఇటీవల విడుదలైన మొదటి గీతం 'ది రేజ్ ఆఫ్ డాకు'కి అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పుడు రెండవ గీతం చిన్ని విడుదలైంది. బాలకృష్ణ, తమన్ కలయిక అంటే పాటలపై సంగీత ప్రియుల్లో అంచనాలు ఉండటం సహజం. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా 'డాకు మహారాజ్'కి తమన్ అద్భుతమైన సంగీతం అందించారని మొదటి గీతంతోనే అర్థమైంది. ఇక ఇప్పుడు రెండో గీతంతో బాలకృష్ణ-తమన్ కలయిక ఎందుకంత ప్రత్యేకమైనదో మరోసారి స్పష్టమైంది. చిన్ని పాటకు తమన్ అందించిన సంగీతం హృద్యంగా ఉంది. మనసుకి హత్తుకునే ఆ సంగీతానికి తగ్గట్టుగా అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం పాటకు మరింత అందం తీసుకొచ్చింది. ఆయన కలం నుంచి జాలువారిన "నువ్వు తే అంటే నీ ముందు తారా తీరాలే. నువ్వు నవ్వుతుంటే అమావాస్యయినా దీపావళిగా మారాలే." వంటి సున్నితమైన, సుమధురమైన పంక్తులు కట్టి పడేశాయి. తన మధుర గాత్రంతో గాయకుడు విశాల్ మిశ్రా పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. లిరికల్ వీడియోని గమనిస్తే అద్భుతమైన విజువల్స్, విశ్వ రఘు ఆకట్టుకునే కొరియోగ్రఫీ చిన్ని పాటకు జీవం పోశాయి. బాలకృష్ణ, చిన్నారి మధ్య భావోద్వేగ మరియు ఉల్లాసభరితమైన బంధాన్ని ఆవిష్కరిస్తూ ఊటీ నేపథ్యంలో ఈ పాటను ఎంతో అందంగా చిత్రీకరించారు. పాప క్షేమం, సంతోషం కోరే రక్షకుడిగా బాలకృష్ణ ఈ 'చిన్ని' గీతంలో కనిపిస్తున్నారు. అలాగే లిరికల్ వీడియోలో చాందిని చౌదరి, ఊర్వశి రౌతేలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# షెర్లాక్ హోం వెనక కథ



వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం 25న థియేటర్లలోకి రాబోతోంది. ఈ టైటిల్ వెనక సీక్రెట్ ను హీరోయిన్ అనన్య నాగళ్ల బయటపెట్టింది. ఇందులో డిటెక్టివ్ అమ్మ పేరు షర్మిలమ్మ, నాన్న పేరు లోకనాథ్, డిటెక్టివ్ పేరు ఓం ప్రకాష్. ఈ మూడు పేర్లలో ఫస్ట్ లెటర్ సౌండింగ్ తో షెర్లాక్ హోమ్స్ అని పెట్టారట. తెలుగులో డిటెక్టివ్ సినిమా అనగానే చిరంజీవి చంటబ్బాయ్ గుర్తుకు వస్తుందని... అందుకే అందరికీ కనెక్ట్ అయ్యేవిధంగా ఆ ట్యాగ్ ని పెట్టారని తెలిపింది అనన్య. ఈ సినిమాలో ఆమె పాత్ర పేరు భ్రమరాంబ. కథలో తనది కీలక పాత్ర అంటోంది. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వైజాగ్ పర్యటన ముగించుకొని అదే రోజు శ్రీపెరంబుదూర్ వెళ్లి మరణించారు. ఒక పెద్ద ఘటన జరిగినప్పుడు చిన్న విషయాల్ని ఎవరూ పట్టించుకోరు. అదే రోజు ఓ కేసు జరిగింది. ఆ కేసు తీగలాగితే డొంక కదులుతుంది. అదే శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ స్టోరీ అని చెబుతోంది అనన్య.

# ఆర్‌ఎఫ్‌సీలో 'సంక్రాంతికి వస్తున్నాం' సంక్రాంతి స్పెషల్ సాంగ్ షూటింగ్



విక్టరీ వెంకటేష్ హైలీ యాంటిసిపేటెడ్ హోల్సమ్ ఎంటర్ టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం'. బ్లాక్ బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మొదటి రెండు పాటలకు చార్ట్‌బస్టర్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగల్ గోదారి గట్టు గ్లోబల్ టాప్ 20 వీడియోస్ లిస్టు లో ప్రవేశించగా, సెకండ్ సింగిల్ మీను కూడా అన్ని మ్యూజిక్ చార్టులలో అగ్రస్థానంలో ఉంది. మేకర్స్ సంక్రాంతి స్పెషల్ సాంగ్ షూటింగ్ మేకర్స్ ప్రారంభించారు. భీమ్స్ సిసిరోలియో సంక్రాంతి ఫెస్టివల్ వైబ్ ని హైలైట్ చేసే మరో అద్భుతమైన నెంబర్ ని కంపోజ్ చేశారు. ఆర్‌ఎఫ్‌సీలో వేసిన వైబ్రెంట్ సెట్ లో హీరో వెంకటేష్, హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ పై ఈ సాంగ్ ని చిత్రీకరిస్తున్నారు. పోస్టర్‌లో వెంకటేష్ ఐశ్వర్య, మీనాక్షి , ఇతరులతో కలిసి డ్యాన్స్ చేస్తూ కనిపించారు. ఇక్కడ అందరూ సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. ఈ ఎనర్జిటిక్, కలర్‌ఫుల్ నంబర్ కు భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ సాంగ్ సినిమా మెయిన్ హైలైట్‌లలో ఒకటిగా ఉంటుంది. వెంకటేష్ ఎక్స్ పోలీస్ పాత్రలో, ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా, మీనాక్షి చౌదరి ఎక్స్ లవర్ గా కనిపించనున్నారు.

# ది ఇండియా హౌస్ నుంచి సతి గా సాయి మంజ్రేకర్



నిఖిల్ మచ్- అవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ది ఇండియా హౌస్'. రామ్ వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, విక్రమ్ రెడ్డి V మెగా పిక్చర్స్ ప్రొడక్షన్ పార్టనర్స్ గా వున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా ఫిమేల్ లీడ్ సాయి మంజ్రేకర్ పుట్టినరోజు సందర్భంగా, మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆమె సతి పాత్రను పోషిస్తుంది, సాంప్రదాయ అవతార్ అందంగా కనిపించింది. సొగసైన చీర, నగలు ధరించి దూరం వైపు చూస్తూ ఎలిగెంట్ గా కూర్చున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. ఈ ఎట్రాక్టివ్ పోస్టర్ లో అద్భుతంగా కనిపిస్తోంది. ఈ పీరియడ్ డ్రామా1905లో సెట్ చేయబడింది. ఇది ప్రేమ, విప్లవం ఇతివృత్తాలను చూపుతోంది. నిఖిల్, సాయి మంజ్రేకర్ ల ప్రేమకథ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ లో ఒకటి కానుంది. ఈ సినిమాలో అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.